

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

19 జులై 2025 పేజీలు : 08 శనివారం




# ఎక్సైజ్ అధికారుల అండతో.. పెట్రేగిపోతున్న గాయత్రి మార్ట్ యజమానులు

కావలి, మేజర్‌న్యూస్ :

కావలి పట్టణంలో నిత్యం వేలాది మంది రద్దీగా తిరిగే ట్రంకురోడ్డులో గాయత్రి మార్ట్.. బార్ అండ్ రెస్టారెంట్‌గా మారిపోవడంతో అక్కడ ఆకతాయిలు మద్యం సేవించి వీరంగం సృష్టిస్తున్నారు. ఇదంతా తెలిసిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఎంత మంది ప్రజలు, ప్రజా సంఘాలు ఫిర్యాదులు చేసినప్పటికీ.. అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోతూ ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ఈ మార్ట్‌పై జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయినా దృష్టి పెట్టాలని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నారు. -మిగతా 2లో














# కావలిలో.. కల్తీ మద్యం కలవరం

**అధికారుల నియంత్రణలో లోపం**

గత ప్రభుత్వంలో కల్తీ మద్యం సేవించి ఇబ్బందులు పడిన వారు, చనిపోయిన వారు ఎంతో మంది ఉన్నారన్న అపవాదు ఉంది. వివరాలు 2లో



# స్థానిక సంస్థలను బలోపేతం చేస్తున్న గొప్ప ప్రభుత్వం

**మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

కేంద్ర ఆర్థిక సంఘ నిధులను నేరు గా పంచాయతీలకే అందించి స్థానిక సంస్థలను బలోపేతం చేస్తున్న గొప్ప ప్రభుత్వం తమదని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా -మిగతా 2లో

# టీడీపీ పార్లమెంటరీ సమావేశం

**హాజరైన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

**వివిధ ప్రధాన అంశాలపై చర్చ**




ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు.

# దర్గాగా చెక్‌డ్యాంపై అక్రమ భవన నిర్మాణం





**కలువాయి, మేజర్‌న్యూస్ :** మండలంలోని కనుపూరుపల్లి గ్రామ పంచాయతీ మజారా గ్రామమైన వెరుబొట్లపల్లిలో 817 సర్వేనంబరు వాగు పోరంబోకు స్థలాన్ని ఓ ధనవంతురాలు దర్జాగా ఆక్రమించి ఆ స్థలంలో అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ 200 అంకణాల భారీ గృహ నిర్మాణం చేపట్టారు. పశువులు నీరు తాగటానికి ఆ ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మించి ఉండగా, ఇప్పుడు అక్కడ ఉన్న చెక్‌డ్యామ్ తొలగించి భారీ భవన నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఆక్రమణ వ్యవహార శైలి రెవెన్యూ

- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- కన్నెత్తి చూడని ఇరిగేషన్ అధికారులు
- ధనవంతులకో న్యాయం.. పేదోడికి మరో న్యాయమా !
- ఇదెక్కడ న్యాయమంటూ.. గ్రామ ప్రజలు అధికారులకు ఫిర్యాదు

అధికారులు తెలిసినప్పటికీ.. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ధనవంతురాలికి ఓ న్యాయం.. పేదోడికి మరో న్యాయం.. అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. అంత పెద్ద భవన నిర్మాణం చేపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. గ్రామ రెవెన్యూ అధికారికి కూడా భారీ స్థాయిలో ముడుపులు ముట్టినట్లు తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కట్టడంపై వీఆర్వో జయరామయ్యను వివరణ కోరగా.. వాగు పోరంబోకు స్థలంలో ఇంటిని నిర్మిస్తున్నట్లు గ్రామస్తుల ద్వారా ఫిర్యాదు వచ్చిందని, కట్టడం జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి విచారిస్తామని తెలిపారు.

# స్థానిక సంస్థలను బలోపేతం చేస్తున్న గొప్ప ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హాజరు కాగా, శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీ, జిల్లా కలెక్టర్ ఆనంద్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీన హాజరయ్యారు. దివంగత మాజీ జెడ్పీ చైర్మన్ బాలచెన్నయ్యకు సంతాపంతో ప్రారంభమైన సభ రాష్ట్ర విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టడమే కాకుండా, తల్లికి వందనం పథకాన్ని అద్భుతంగా అమలు చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తూ కావలి ఎంఎల్ఏ కృష్ణారెడ్డి ప్రతిపాదించిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడంతో సభ ముగిసింది.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తదితరులు

ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల సమస్యలపై జడ్పీటీసీ సభ్యులు అర్థవంతమైన రీతిలో చర్చించడం సంతోషకరమన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల సభ్యులకు గౌరవం, విలువ ఇచ్చే ప్రభుత్వమని, వారికి గౌరవ వేతనం మంజూరులో జరుగుతున్న జాప్యం సహించరానిదని వెంటనే జిల్లా పరిషత్ అధికారులు సమన్వయంతో కృషిచేసి గౌరవ వేతనాన్ని మంజూరు చేయాలన్నారు. స్థానిక సంస్థల నిధులను వాడుకునే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణాలను పూర్తిచేసి సచివాలయ వ్యవస్థను పురోగతిలోకి తీసుకువస్తామన్నారు. అలాగే గత ప్రభుత్వ నిర్వాకంతో మూలనపడిన జల్ జీవన్ మిషన్ పనులను పూర్తిచేసి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని 4 లక్షల కుటుంబాలకు మంచినీటి వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. అదేవిధంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి జిల్లాలోని 3,74,345 మందికి లబ్ధి చేకూర్చామన్నారు. త్వరలోనే రైతు భరోసా, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం తదితర పథకాలను అమలు చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా పీఎం సూర్య ఘర్ యోజన పథకం ద్వారా ప్రతి నియోజకవర్గానికి పదివేల సౌర విద్యుత్ కనెక్షన్ లను అందిస్తున్నామని, ఎస్సీ ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ లభించే ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో సాంకేతిక విద్యాభివృద్ధికి ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. కారుణ్య నియామకాలకు సంబంధించి స్థానిక సంస్థల్లో పని చేసి మరణించిన వారి కుటుంబ సభ్యులకు స్థానిక సంస్థల్లో మాత్రమే ఉద్యోగ కల్పన జరుగుతుందన్నారు. అదే సమయంలో ఇతర శాఖల్లో పనిచేస్తూ మరణించిన కుటుంబ సభ్యులకు మరేతర శాఖల్లో ఉద్యోగ కల్పనకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో మోహన్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ..** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకానికి సంబంధించిన మండల స్థాయి వివరా లను పొందుపరచకపోవడం భావ్యం కాదన్నారు. అదేవిధంగా కావలి జడ్పీ ఉన్నత పాఠశాలకి చెందిన 9 ఎకరాల భూమిలో 2 ఎకరాల్లో 174 పేద కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ వారికి ఇంటి పట్టాలు లేవని సభ దృష్టికి తేగా, భూబదలాయింపుకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే 275 మంది విద్యార్థినులు ఉన్న కావలి కేజీబీవీ స్కూలులో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అదేవిధంగా కొత్త విద్యుత్ మీటర్లు బిగించినందువల్ల కరెంట్ బిల్లులు పెరిగాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. గ్రామాల్లో సైతం త్రీ ఫేజ్ విద్యుత్ ఇస్తున్న ప్రస్తుత తరుణంలో విద్యుత్ లైన్లను పెరుగుపరచాలని సూచించారు.

**ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ..** గత ప్రభుత్వ అమ్మ ఒడి పథకం ప్రస్తుత తల్లికి వందనం పథకం సమానం కాదని, గతంలో కేవలం ఒక బిడ్డకు మాత్రమే అమలు చేస్తే, ప్రస్తుతం కుటుంబంలో చదువుకుంటున్న పిల్లలు ఎంత మంది ఉంటే అంత మందికీ ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని, అందుకే బోత్ ఆర్ నాట్ సేమ్ అన్నారు.

## ఎక్సైజ్ అధికారుల అండతో పెట్రేగి పోతున్న

### గాయత్రి మార్ట్ యజమానులు

(మొదటి పేజీ తరువాయి)

తెల్లవారింది మొదలు ఇక్కడ ఆకతాయిలు మద్యం సేవిస్తూ ఉంటారు. అసలు ఇది మార్ట్, బార్ అండ్ రెస్టారెంటా.. అనేది అర్థం కాని పరిస్థితి నెలకొందని ప్రజల వాదన. నిత్య కళ్యాణం.. పచ్చ తోరణంగా ఈ గాయత్రి మార్ట్ పూడు ఫుల్‌లు, ఆరు క్వాటర్లు అనే చందంగా ఉంది. రాత్రి సమయంలో బార్ తలపించేలా ఈ మార్టు ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రత్యేకంగా కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఈ గాయత్రి మార్ట్‌పై సంబంధిత అధికారులు లక్షల్లో లావాదేవీలు జరిగాయని మార్టు యజమానే బహిరంగంగా చెబుతుండటం గమనార్హం. ఈ మార్టు విషయంలో అధికారులు కూడా మౌనంగా ఉండటం పట్ల పలు అనుమానాలకు తావిస్తోందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ గాయత్రి మార్టు విషయంలో చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

## టీడీపీ పార్లమెంటరీ సమావేశం

### హాజరైన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, కింజారపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈనెల 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏపీ ప్రయోజనాల కోసం అనుసరించా ల్సిన వ్యూహంపై ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొని సీఎం సూచనలు, సలహాలు తీసుకున్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల పరిష్కారం వంటి అంశాలపైనా సీఎం చర్చించారు. పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణదేవరాయలు, పలువురు లోక్‌సభ, రాజసభ సభ్యులు హాజరయ్యారు.

## కావలిలో కల్తీ మద్యం కలవరం

### అధికారుల నియంత్రణలో లోపం



**కావలి, మేజర్‌న్యూస్ :** గత ప్రభుత్వంలో కల్తీ మద్యం సేవించి ఇబ్బందులు పడిన వారు, చనిపోయిన వారు ఎంతో మంది ఉన్నారన్న అపవాదు ఉంది. అయితే ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి పట్టణంలో కొన్ని బార్ అండ్ రెస్టారెంట్, వైన్ షాపులలో కల్తీ మద్యం చేసి నైట్ సేల్స్ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కల్తీ మద్యం సేవిస్తున్నట్లు కొంత మంది తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కల్తీ మద్యం జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు 24 గంటలు తెరిచి ఉన్నా అధికారులు పట్టీపట్టనట్లుగా ఉంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే కావలి గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు అధికంగా నిర్వహిస్తున్నప్పటికీ వాటిపై కూడా నియంత్రణ లేకుండా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు. గ్రామాల్లోని మహిళలు ఈ బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలనే ఆదేశిస్తుంటే.. ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న అధికారులు మాత్రం మామూళ్లు తీసుకుంటున్నట్లు బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. కల్తీ మద్యంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

# ఛార్జ్ షీట్లు దాఖలు చేసి నోటీసులు జారీ చేయండి

### కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు, కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేకుండా చేపట్టే అనధికార నిర్మాణాలు, అనుమతులను అతిక్రమించి చేపట్టే అక్రమ కట్టడాలను గుర్తించి, సంబంధిత యజమానులపై ఛార్జ్ షీట్లు దాఖలు చేసి నోటీసులు జారీ చేయాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఛార్జ్ షీట్లు దాఖలాపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కోర్టు కేసుల కోసం అవసరమైన సర్వే రిపోర్ట్ లను సంబంధిత సర్వేయర్లు వేగవంతంగా పూర్తిచేసి సమర్పించాలని సూచించారు. సచివాలయాల పరిధిలోని ప్రతి ఒక్క వార్డు ప్లానింగ్ కార్యదర్శి ఛార్జ్ షీట్లు దాఖలు చేసి కోర్టు కేసులకు అవసరమైన అన్ని వివరాలను సమగ్రంగా అందించాలని, రోడ్లను ఆక్రమిస్తూ చేపడుతున్న నిర్మాణాలతో పాటు తాత్కాలిక దుకాణాలు, అనుమతులు లేని పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనధికార నిర్మాణాలు, అక్రమ కట్టడాలకు సంబంధించిన కోర్టు కేసుల వాయిదాల సమయంలో క్రమం తప్పకుండా కౌంటర్లు దాఖలు చేస్తూ, పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు, ఇంచార్జ్ సీపీ రఘు నాథ్ రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, మురళి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ర్యాంకు సాధనలో ఇంజనీరింగ్ విభాగం పాత్ర అభినందనీయం

### కమిషనర్ వై.ఓ నందన్




**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ భారత్ మిషన్లో భాగంగా ప్రతి సంవత్సరం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో భాగంగా 2024-25 వార్షిక సంవత్సరానికి గాను నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 37వ ర్యాంకు సాధించడంలో కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాత్ర అత్యంత అభినందనీయమని కమిషనర్ వై.ఓ నందన్ ప్రశంసించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కమిషనర్‌ను శుక్రవారం కలుసుకుని పూల మొక్కల కుండీలను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు సాధనకు కృషి చేసిన ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, ఈఈ రహంతు జానీ, అనిల్ కుమార్, డి.ఈలు ముజాహిదీన్, రఘురామ్, సుధేష్ణ, ప్రసాద్, ఎఈ అర్చిత తదితరులను కమిషనర్ శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు, పిఎంయు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతినెల మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే

- ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలి
- జాయింట్ కలెక్టర్ కార్తీక్
- కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్ డేకు మంచి స్పందన



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెల మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే లో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఓ హుస్సేన్ సాహెబ్ పాల్గొని ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ మొదలైన శాఖలకు చెందిన ఉద్యోగులు తమ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రధానంగా బదిలీలకు సంబంధించి ఎక్కువగా వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ప్రతినెల మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రీవెన్స్ డే లో ఉద్యోగులు అందించిన అర్జీలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సత్వరమే చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రీవెన్స్ డే కార్యక్రమానికి పలు సమస్యలపై సుమారు 124 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలి : ఎంపీడీఓ

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు తప్పనిసరిగా పనులు కల్పించాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. అనంతసాగరం గ్రామపంచాయతీలో శుక్రవారం ఉపాధి హామీ పనులలో భాగంగా చేపట్టిన కుంట కూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ వేతనం దారులతో మాట్లాడుతూ కొలతల ప్రకారం పని చేసినట్లయితే ప్రభుత్వం నిర్ణయించిన విధంగా 307రూపాయలు వేతనంగా పొందవచ్చునని తెలిపారు. సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకుల ద్వారా రోజువారి చేయవలసిన పని మార్కింగ్ ఇప్పించుకున్నట్లయితే ఆ కొలతల ప్రకారం పనిచేసి పూర్తి వేతనం ఉపాధి హామీ పథకం ద్వారా పొందవచ్చునని తెలిపారు. పని ప్రదేశంలోని హాజరు పరిశీలించారు. ఉపాధి హామీ వేతదారులకు వారు చేయవలసిన పనులను తప్పనిసరిగా మార్కింగ్ చేసి వారు పూర్తి వేతనం పొందే విధంగా సహకరించాలని క్షేత్రసహాయకునికి సూచించారు. ఎక్కువ పనులను గుర్తించి ఎక్కువ మంది ఉపాధి పొందేవిధంగా అంచనాలు రూపొందించాలని సాంకేతిక క్షేత్ర సహాయకులకు సూచించారు.

## బదిలీ ఉపాధ్యాయినికి సన్మానం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వెన్నవాడ పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీలలో బుచ్చిరెడ్డిపాలెం వెళ్ళిన ఉపాధ్యాయిని ఆర్.జీవనికి శుక్రవారం సన్మానం చేశారు. సన్మాన కార్యక్రమం ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖాధికారి కొల్లు చలపతి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయిని 6సంవత్సరాల ఈ పాఠశాలలో పని చేసిన కాలంలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కె.రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. వారు విద్యార్థులతో ప్రేమ అభిమానం చూపేవారని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించారని తెలిపారు. తదుపరి ఆమెను తల్లితండ్రులు ఎస్ఎంసి, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ కె.లావణ్య, గండ్లవీడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. వెంగయ్య, ఉపాధ్యాయులు ఆర్.విజయలక్ష్మి, మహేష్ సిఆర్‌పి మురళి, ఎస్ఎంసి సభ్యులు విజయనరసింహారెడ్డి, పెంచలమ్మ, సునంద, రాధమ్మ, కళ్యాణి, పెంచలరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం నిర్మాణం గ్రామంలోని కంచర్ల శేషయ్య నాయుడు మెమోరియల్ జడ్పీ హైస్కూల్లో పనిచేస్తూ బదిలీ, పదోన్నతిపై మరొక పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కంచర్ల శేషయ్య నాయుడు ట్రస్ట్ తరపున యు.అంకయ్య చౌదరి, సురేంద్రల ఆధ్వర్యంలో పదోన్నతపై వెళ్లిన ఉపాధ్యాయులు దేవకుమార్, శ్రీనివాసులను, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నరేంద్ర, అంయర్ ఖదీర్, మాలిని లను ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. అలాగే చిరమణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యాధికారులు డాక్టర్ జ్యోతి రాణి డాక్టర్ నాగ వినూతలను ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ శ్రీధర్ నాయుడు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు వాణి ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూడు పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలం లోని గోగులపల్లి, బొమ్మవరం, వడ్డీ పాలెం గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎంఈఓ టు కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్ బుక్ పరిశీలించారు. బడి మానివేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని ఆయన ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయం

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** పడమటి కంభంపాడు గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబ పెద్ద షేక్ ఖాజావలి గారు ఇటీవల హార్ట్ ఎటాక్ రావడంతో హార్ట్ ఆపరేషన్ చేయించుకున్నారు. వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వెంకట రమణారెడ్డి, టీమ్ తరపున హార్ట్ మెడిసిన్ కొనుగోలు కోసం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆరోగ్య పరిస్థితిని టీం సభ్యులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలోహెల్పింగ్ హార్ట్స్ టీమ్ సభ్యులు. రొండా శ్రీనివాసులు రెడ్డి, బొమిళ్ళ మురళి, 108 నరసింహారెడ్డి, శింగనమల మల్లికార్జున రెడ్డి, షేక్ గౌస్ పోస్టల్, దాసరి విజయ్, పుక్కకట్ల పెంచలయ్య, పెద్దలుగా పటాన్ మహబూబ్ భాషా పాల్గొన్నారు.

# బోయల్పాడులో రోడ్డుపైనే మురికి నీరు

## పట్టించుకోని పంచాయతీ పాలకులు





**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని బోయలపాడు గ్రామం అపరిశుభ్ర వాతావరణంకి ఆలవాలమైంది. రోడ్డుపైనే మురికి నీరు చేరి, దోమల ఆవాసానికి నిలయమైంది. రోడ్డుపైన వెళ్లాలంటేనే దోమలు ఎక్కడ కుడతాయో అని ప్రజలు భయపడుతున్నారు. పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడం తోనే ఈ పరిస్థితి ఎదురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేసవిని తలపిస్తున్న ఈ కాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే, వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఈ ఫోటోలు చూస్తే అర్థమవుతుంది. ఇదంతా ఒక ఎత్తు అయితే, బోయల్పాడు నుంచి వేములపాడు గ్రామానికి వెళ్లాలంటే రోడ్డు సిద్ధమై, మోకాటి లోతు గుంతలలో వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కురిసిన చిన్నపాటి వర్షానికి గుంతలన్నీ నీటితో నిండి ద్విచక్ర వాహనదారులు వెళ్లేందుకు భయపడే విధంగా పరిస్థితి తయారయింది. వేములపాడు నుంచి మండల కేంద్రమైన జలదంకికి, కావలి పట్టణానికి రావాలంటే బోయల్పాడు గ్రామం నుంచి, కావలి కాలువ జీప్ ట్రాక్ మీద గ్రామ ప్రజలు వెళ్లాల్సి ఉంటుంది. చిన్నపాటి వర్షం కురిసినా కావలి కాలువ జీప్ ట్రాక్ మీద వెళ్లే పరిస్థితి ఉండదు. దీంతో బోయల్పాడు గ్రామానికి వచ్చి వెళ్లాల్సి ఉంటుంది. బోయల్పాడుబి వేములపాడు మధ్య ఉన్న రోడ్డు తారు రోడ్డు అయినా కూడా పూర్తిస్థాయిలో గుంతలతో ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగేలా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు బోయల్పాడు గ్రామంలో అపరిశుభ్ర వాతావరణాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే బోయల్పాడు నుంచి వేములపాడు మధ్య ఉన్న రోడ్డును పునర్ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రజా సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం అని తెలుగుదేశం నాయకులు వీరపురెడ్డి సుదర్శన రెడ్డి, షేక్ మస్తాన్ వలి, షేక్ ఖాజావలి పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖమాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి సూచనలు మేరకు సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నువ్వూరుపాడు పంచాయతీ మజారా గ్రామం పాత జంగాలపల్లిలో వారు ఇంటింటా పర్యటించారు. టీడీపీ యువ నాయకుడు వీరపురెడ్డి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో గడప – గడప ప్రోగ్రాం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ టీడీపీ అధ్యక్షులు షేక్ మస్తానువలి, గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజావలి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. వారు ఇంటింటికెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ ఏడాదిలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చా రన్నారు. తల్లికి వందనం పథకం, ఉచిత గాస్ సిలిండర్ల పంపిణీ, పెన్షన్ పెంపు, మెగా డిఎస్‌సి తదితర కార్యక్రమాలు అమలు చేసారని పేర్కొన్నారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయనున్నారని, వచ్చే నెలలో మహిళకు ఉచిత బస్ ప్రయాణం సౌకర్యం కల్పించనున్నారని వారు తెలిపారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్, రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేశారని సుదర్శనరెడ్డి, మస్తాన్ వలి, ఖాజావలి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

# డెంగ్యూ మాసోత్సవాలపై అవగాహన సదస్సు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జలదంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కావలి సబ్ యూనిట్ ఆఫీసర్ నరసయ్య ఆధ్వర్యంలో డెంగ్యూ మాసఉత్సవాలపైన అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. డెంగ్యూ జ్వరం ఈడిస్ అనే దోమ కాటు వలన చిన్నపిల్లల నుండి పెద్దవారి వరకు అందరికీ సోకు తుందని, సరైన సమయంలో జాగ్రత్తలు పాటించనట్లయితే ప్రాణాంతకం అవుతుందని తెలియజేశారు. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రక్త పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఈ దోమ మన ఇంటి ముందు, మన ఇంటి పరిసరాలలో నిల్వ ఉంచుకున్న మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉన్న తొట్లు, డ్రమ్ములు కుండలు మరియు వాడి పారేసిన ప్లాస్టిక్ బాటిల్స్, టీ కప్పులు, కొబ్బరి బోండాలు, పాత టైర్లు, మొదలగు వాటిలో ఈ దోమ గుడ్లు పెట్టి పిల్లలు చేసి డెంగ్యూ దోమగా మారి, ఈ దోమ కుట్టడం ద్వారా డెంగ్యూ జ్వరాన్ని కలుగజేస్తుందని అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి వాడుకునే నీటి వనరులపై పూర్తిగా మూతలు కప్పి ఉంచటం పరిసరాలలో వ్యర్థపదార్థాలు లేకుండా చూసుకోవడం ద్వారా డెంగ్యూ దోమ పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హరి ప్రసాద్ తమ పాట ద్వారా విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శ్రీమతి కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు సుజాత, మానస పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలికను తండ్రికి అప్పజెప్పిన పోలీసులు



**కలువాయి, మేజర్‌న్యూస్ :** మతిస్థిమితం లేక తప్పిపోయిన బాలికను కలువాయి పోలీసులు బాలిక తండ్రికి అప్పజెప్పిన సంఘటన కలువాయి లో చోటుచేసుకుంది. కలువాయికి చెందిన మేడిబోయిన చంద్రకి పెళ్లి అయ్యి పాప ఉంది, మొదటి భార్య భర్త, పాపను వదిలి వెళ్లిపోవడంతో చంద్ర ఇందుకూరు పేటలో మరో వివాహం చేసుకొని అక్కడే నివాసం ఉంటున్నాడు. మతి స్థిమితం సరిగ్గా లేని పాప ఈనెల 16వ తేదీ ఇంట్లో చెప్పకుండా రైలు ఎక్కి తిరుపతి వెళ్ళిపోయింది. రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు పట్టుకొని విచారించి కలువాయి ఎస్సై కోటయ్యకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఎస్సై వారి తండ్రి వివరాలు సేకరించి వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి ఐసిడిఎస్ అధికారుల ఆధ్వర్యంలో ఆ బాలికను వాళ్ళ తండ్రికి అప్పగించారు.

# ముదనష్టంగా మురుగళ్ళ రోడ్డు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలోని మురుగళ్ళ రోడ్డు అత్యంత దయనీయంగా ఉంది. అది గడుగునా గుంటలుమయమై ప్రజలకు అత్యంత ఇబ్బందికరంగా ఉంది. ఆత్మకూరు –బట్టేపాడు రోడ్డు నుండి నల్లపురెడ్డిపల్లి, మురుగళ్ళ, కను పూరుపల్లి వరకు 8కిలోమీటర్ల రోడ్డు గుంటలు పడి వాహనకారులు నరక యాతన అనుభవిస్తున్నారు. ద్విచక్ర వాహనకారులు మరింతగా ఇబ్బంది పడుతున్నారు. ఈరోడ్డు దుస్థితి గురించి ఎన్నిమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఏడాది క్రితం రోడ్డు మరమ్మత్తులు అంటూ కొంత రోడ్డును జేసిబితో త్రవ్వారు. ఇక అంటే పనులు చేయకుండా నిలిపివేశారు. దాంతో ఇబ్బందులు మరింతగా పెరిగాయని వారు ఆవేదనతో చెబుతున్నారు. ఈ మూడు గ్రామాల వారు ఇంతగా నరకయాతన పడుతుండగా ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. ఇది కక్షా, వివక్ష అర్థం కావడం లేదంటున్నారు. ఆరేడు సంవత్సరాలుగా తాము ఈ రోడ్డుతో అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా తమ అవస్థలు గమనించాలని, రోడ్డు దుస్థితి పరిశీలించాలని, తగు చర్యలు తీసుకోవాలని వారంతా ముక్తకంఠం తో కోరుతున్నారు. మరి ఎవరైనా స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.

## గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక స్త్రీశక్తి భవనంలో గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై సీసీలు, వీవోఏలు, గ్రామ సంఘ అధ్యక్షులతో ఏపీఎం శారప్రవతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు, హక్కులు, జీవనోపాధులు, ప్రభుత్వ ఆస్తులు, సామాజిక అభివృద్ధి ప్రణాళిక గురించి అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో ఆయా అంశాల్లో భాగంగా ప్రజలకు అవసరమైన సేవలను గుర్తించి గ్రామాల్లో నిర్వహించే గ్రామసభల్లో చర్చించి వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో బాలగురవయ్య, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చాలీ చాలని జీతాలతో కార్మికుల కడుపులు కొట్టద్దు

- ఎమ్మెల్యే కోటంరెడ్డికి యూనియన్ నాయకులు వినతి
- మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చూస్తాను అని హామీ




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** గత 6 రోజుల నుండి విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు శుక్రవారం ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుండి కెవిఆర్ పెట్రోల్ బంక్ వద్దనున్న రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించి యూనియన్ నాయకులు కార్మికులు సమస్యలు వివరించారు. సానుకూలంగా స్పందించిన రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే.పెంచల నరసయ్యలు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు గత ఆరు రోజుల నుండి విధులు బహిష్కరించి తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె పోరాటం చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైన పద్ధతి కాదని అన్నారు. నిరంతరం చెత్తాచెదారం మలినాలు మలమూత్రాలను శుభ్రపరుస్తూ కార్మికులు తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారని అన్నారు. పరిశుద్ధ కార్మికులు బలహీన వర్గాలకు చెందిన దళితులు గిరిజనులుగా ఉన్నారని అన్నారు. కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసం బలహీన వర్గాల కార్మికుల కడుపులు కొట్టడం సరైన చర్యకాదని విమర్శించారు. చాలీచాలని జీతాలతో ఇంజనీరింగ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకులలో నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ రాష్ట్రంలో 4వ స్థానం సాధించిందని ఇది కార్మికుల శ్రమతోనే సాధ్యమైందని అన్నారు. కార్మికులు తమ సమస్యలు పరిష్కరించమని విధులు బహిష్కరించి ఆందోళన చేస్తుంటే వారి గురించి ఆలోచించకుండా మొండిగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని విమర్శించారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు న్యాయమైన సమస్యలు అడుగుతున్నారని వారి సమస్యల పరిష్కారం కోసం తనవంతు కచ్చితంగా ప్రయత్నం చేస్తానని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రితో, అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిఐటియు నెల్లూరు నగర నాయకులు పి. సూర్యనారాయణ, సిఐటియు రూరల్ నాయకులు సుధాకర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# మాబడి మార్చవద్దు అంటూ విద్యార్థులు నిరసన



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలం పొతేగుంట అరుంధతియవాడ గ్రామంలో, సుమారు 180 కుటుంబాలు ఉన్నప్పటికీ ఆవాడ నుండి దాదాపు 28 మంది విద్యార్థులు ఉండగా మోడల్ స్కూల్ పేరుతో చదువుతున్నటువంటి స్కూల్ నుండి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో ఉన్న స్కూలుకి మార్చారని, పిల్లలు తల్లిదండ్రులు ఉదయం ఐదు ఆరు గంటల సమయంలో పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్తూ ఉంటామని మా వాడలో ఉంటేనే స్కూలు ఎవరో ఒకరు మా బంధు వర్గీయులు పిల్లలకు ఏదైనా జరిగితే అందుబాటులో ఉంటున్నారని ఇప్పుడు మా వాడికి స్కూలుకి దాదాపు ఒకటిన్నర కిలోమీటర్లు నుండి రెండు కిలోమీటర్ల వరకు ఉంటుందని అంత దూరం పంపించడానికి తల్లిదండ్రులుగా మేము నిరాకరిస్తూ దాదాపు 38 రోజులుగా విద్యకు దూరమైన విద్యార్థులు మా గ్రామంలోని స్కూలు ఉండాలి వేరే గ్రామంలోని స్కూలుకి వెళ్ళమంటూ విద్యార్థులు నిరసన తెలియజేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు గ్రామంలోని రాజకీయ నాయకులతో చేతులు కలిపి స్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌కి విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సాధారణ మీటింగ్ లాగే కొన్ని అంశాలపై చర్చిస్తామని చెప్పిన టీచర్, అసలు విషయం దాసిపెట్టి పిల్లలు తల్లిదండ్రుల దగ్గర ఒకరికి తెలియకుండా ఒకరి దగ్గర సంతకాలు తీసుకోవడం జరిగిందని పిల్లల తల్లిదండ్రులు తమ ఆవేదన వ్యక్తపరిచారు. మండల ఎంఈఓలు మా పిల్లల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని పిల్లల తల్లిదండ్రులు తెలిపారు. మా గ్రామంలోనే మా పిల్లలకు విద్యనందించాలని మీడియా ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మందా వెంకటేశ్వర రావు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి జాతీయ నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు పంధిటి అంబెడ్కర్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా నాయకులు సూరిపాక ఉదయ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మార్పీఎస్ నాయకులు గంగాధర్, ఏడుకొండలు, పెంచలయ్య పోతేగుంట గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే' కార్యక్రమంలో భాగంగా, నెల్లూరు నగరం నందు జనార్ధన్‌రెడ్డి కాలనీ, పట్టణ ఆరోగ్యకేంద్రం పరిధిలోని వెంకటేశ్వ రపురం వార్డ్ నందు మండలప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలనందు పిల్లలకు డెంగ్యూ వ్యాధి మాసోత్సవాలను పురస్కరించుకుని కీటక జనీత వ్యాధుల నియంత్రణ నివారణలో భాగంగా డెంగీ వ్యాధిపై అవగాహనా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటి ఇంటి సర్వే పరిశీలంచడం జరిగింది. కార్యక్రమంలో నెల్లూరు మండల విద్యాధికారి, ఆ పాఠశాల ఉపాధ్యాయులు, అసిస్టెంట్ మలేరియా అధికారి యూ.నాగార్జునరావు, రిసర్వ్ సబ్ యూనిట్ అధికారి ఓ.జయరామ్. నెల్లూరు అర్బన్ సబ్ యూనిట్ అధికారులు ఈ.శ్యాంసనబాబు, ఎస్‌సిహెచ్ రామారావు సంబంధిత హెల్త్ అసిస్టెంట్ దొరబాబు, వార్డ్ హెల్త్ సెక్రెటరీ, సీఓ, ఆశాలు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు : తటవర్తి



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర రాజధాని అమరావతిలో ఆంధ్ర రాష్ట్ర సాధకులు అమరజీవి పొట్టి శ్రీరాములుకి అమరావతిలో సమున్నత గౌరవం కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యములు కూటమి సర్కారు మంచి నిర్ణయాన్ని తీసుకుందని దీనికి సిఆర్‌డిఏ పరిధిలో 6.8 ఎకరాల స్థలాన్ని కేటాయించి అందులో స్మారక భవనంతో పాటు భావితరాలకు గుర్తిండి పోయేందుకు తీర్చిదిద్దాలని ఒక మంచి ప్రణాళికతో సంబంధిత పత్రాలను మంత్రి పొంగూరు నారాయణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ నుండి రాకేష్‌కు అందజేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ మంచి నిర్ణయానికి రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వెల్ఫేర్ డైరెక్టర్ తటవర్తి వాసు సీఎం చంద్రబాబు నాయుడుకి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కావలి ఆర్యవైశ్య నేతలు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆర్యవైశ్యులకు ఎంతో అండగా ఉంటూ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేక గౌరవాన్ని ఇస్తూ తమ సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని వాసు తెలిపారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని అధికారికంగా నిర్వహించడం తమ హృదయ వీణను తాకిందన్నారు. త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు జయంతి వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తమపై మాతృ ప్రేమ చూపుతూ, తమ పురోభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్ని వర్గాలను అదే దృష్టితో ఆదరిస్తున్నారని తెలిపారు. కృతజ్ఞతగా భవిష్యత్తులో ఆర్యవైశ్య సమాజం వారి వెంట ఉండి అన్ని విధాల బాసటగా నిలుస్తాం అని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ తెలిపారు.

# విద్యతోపాటు క్రమశిక్షణ నేర్పించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ నేర్పించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ కాలనీ ఉర్దూ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సం దర్భంగా ఆయన విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మనబడి మన భవిష్యత్తు పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయించి అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని నవాబుపేట రవీంద్ర భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు విద్యార్థులకు ఎస్పీ కృష్ణకాంత్, డిఎస్పి సింధు ప్రియా, సీఐ జి.వేణు గోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు టూ టౌన్ ఎస్ఐ రెహమాన్ చట్టాలపై అవగాహన, సమాజంలో జరుగుతున్నటువంటి సైబర్ నేరాలు, క్రికెట్ బెట్టింగ్లు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఇన్వెస్టిట్యూడ్ సెరిమని వేర్ విల్ ది లీడర్షిప్ క్వాలిటీస్ టు ద స్టూడెంట్స్ పెంపొందే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సెల్ ఫోన్ వాడకాలు తగ్గించి చక్కగా చదువు కోవాలని అలాగే ఫోన్లలో వచ్చే లింకులను ఓపెన్ చేయరాదని, చెడు స్నేహాలకు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలియజేశారు. అదేవిధం గా విద్యార్థినీ విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఇబ్బంది కలిగితే 112 నెంబర్‌కి ఫోన్ చేయాలని,



విద్యార్థిని విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కోట్ల రూపాయల కంటే విలువైనది ఒక చదివేనని, కావున ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని తమ పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకోరావాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ శ్రీహరి స్కూలు ప్రిన్సిపాల్ నిరూపమా డీన్ శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, సైబర్ మోసాల గురించి విస్తృతంగా ప్రజలకు, మహిళలకు, విద్యార్థిని లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ శుక్రవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాల బాలికలపై జరిగే నేరాలు అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ మరియు ఇతర చట్టాలు, శిక్షల గురించి విద్యార్థులకు నెల్లూరు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళ రక్షణ కవచం 'శక్తి' యాప్ అని, ప్రతి మహిళ ఫోన్లో శక్తియాప్ ఉండాలన్నారు. ఆపద సమయాల్లో పోలీసు వారి తక్షణపు సహాయం పొందడానికి ప్రతి ఒక్క మహిళ, గృహిణిలు, విద్యార్థులు, బాలికలు తమ దగ్గర ఉన్న మొబైల్ లో శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవడం ఎంతైనా ఆవశ్యకత ఉందన్నారు. ఈ శక్తి యాప్‌ను మొబైల్లో డౌన్లోడ్ చేసుకునే విధానం, దాని ఉపయోగాలు, బాల్యవివాహాలు, బాల కార్మిక, వెట్టిచాకిరీ చాకిరి వ్యవస్థలు, మానవ అక్రమ రవాణా, ఫోక్సో యాక్ట్, చట్టాలు, మాదకద్రవ్యాల నిషేధం, డయల్ 100, 112, 1098, 1930, ఈగల్ సెల్ 1972 మొదలైన అంశాలపై జిల్లా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేశారు.

## పీ4 గ్రామ సభలను నిర్వహించని అధికారులు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** పీ4తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి సంకల్పంతో ముందుకు వెళుతుంటే, జలదంకి మండలంలోని అధికారులు ఆ పథకాన్ని నీరు కారుస్తున్నారు. 2047వ సంవత్సరం నాటికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తవుతుందని, ఈ లోగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఉన్నత స్థితిలోకి తీసుకురావాలనే సంకల్పంతో పి ఫోర్ కార్యక్రమాన్ని ప్రారంభించి, సర్వే కూడా నిర్వహించారు. ఈ సర్వేలో సెంటు భూమిలేని పేదల కుటుంబాలను గుర్తించి ఆ కుటుంబాలన్నింటిని బంగారు కుటుంబాలుగా నామకరణం గ్రామ సభలలో బంగారు కుటుంబాల జాబితాలను పరిశీలించి, ఏమైనా మార్పులు చేర్పులు చేయాల్సివుంటే ప్రజల ఆమోదంతో అధికారులు, పంచాయతీ పాలకులు కుటుంబాల వివరాలను పొందుపరచాల్సి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అట్టడుగు వర్గాల నిరుపేదల అభ్యున్నతి కోసం ప్రవేశపెడితే జలదంకి మండలంలో అధికారుల తీరుతో నీరుకారిందనే చెప్పవచ్చు. కారణం ఎంపీడీవో కార్యాలయం నుంచి పి 4 గ్రామసభలు నిర్వహించాలని 17, 18 తేదీలను ఖరారు చేస్తూ పర్యవేక్షణ అధికారులను సైతం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కొన్ని పంచాయతీలలో సర్పంచులు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయగా, మెజార్టీ పంచాయతీలలో సెక్రటరీలు గ్రామాలలో ప్రజలకు గ్రామ సభల గురించి తెలియజేయకుండానే, కార్యక్రమాలు నిర్వహించలేదు. కృష్ణపాడు, కొత్తపాలెం తదితర గ్రామాలలో పి ఫోర్ గ్రామసభ అంటే ఏమిటంటు ప్రజలు అనుకుంటున్నారు. కారణం ప్రజలకు అధికారులు పాలకులు పి ఫోర్ గురించి చెప్పకపోవటమే.

ఇదంతా ఒక ఎత్తు అయితే కార్యక్రమాన్ని సజావుగా జరిపించాల్సిన ప్రత్యేక అధికారులు కూడా ఈ కార్యక్రమాలకు డుమ్మా కొట్టడం కొసమెరుపు. ప్రభుత్వ ఆశయం నెరవేరేనా అంటూ మండల ప్రజలలో ప్రచారం సాగుతుంది.

## ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన మురళి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా మురళి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉండి బదిలీపై నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియమించారు. దీంతో ఆయన అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా బాధ్యతలు చేపట్టారు.

## చేజర్ల డిప్యూటీ ఎంపీడీఓగా జి.అమర్



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా జి.అమర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన కొడవలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొంది చేజర్ల మండలానికి వచ్చారు.ఈ సందర్భంగా మండలంలోని సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో జి.అమర్ మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు.

## ప్రకృతి వ్యవసాయం దిగుబడులు ఆరోగ్యానికి మేలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ప్రకృతి వ్యవసాయం దిగుబడులు ఆరోగ్యానికి చాలా పిడతాపోలూరు గ్రామ సచివాలయం వ్యవసాయ శాఖ సహాయకులు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఈ పంచాయతీ పరిధిలో జంగాల కండ్రిగ గ్రామ పంట పొలాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. నవధాన్యాలు భూమిలో చల్లి తదుపరి ద్వారా కలిగే బహుళ ప్రయోజనాల గురించి వివరిస్తూ కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట, ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల వ్యవసాయ శాఖ సహాయకుల బృందం ఈ కార్యక్రమాల ద్వారా అవగాహన పొందింది. ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రం సిబ్బంది హాజరయ్యారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చునన్నారు. మార్కెటింగ్ సదుపాయం కూడా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రతి రైతు కొంతమేరకు ఈ వ్యవసాయం చేపట్టాలని వ్యవసాయ శాఖ సహాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రీఛా సంస్థ ఆధ్వర్యంలో వర్క్ షాప్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రీఛా ఆధ్వర్యంలో నోకియా వారి సహకారంతో స్మార్ట్ పూర్ ఇంపాక్ట్ అండ్ ఇన్సైట్స్ యాన్యువల్ షోకాసింగ్, కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్‌ను నెల్లూరులోని టౌన్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డిఏ ఏపిఎం మస్తాన్ మాట్లాడుతూ.. రీఛా సంస్థ స్మార్ట్ పూర్ ప్రాజెక్ట్ ద్వారా చేస్తున్న సర్వీస్, సేవ కార్యక్రమాలు హర్షించదగినవని కొనియాడారు. ప్రభుత్వం చేపడుతున్న పీ4 కార్యమాన్ని కూడా ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాలలో విస్తరించాలన్నారు. రీఛా కార్యక్రమాలతోపాటు ప్రభుత్వం వివిధ నైపుణ్యాలు ద్వారా ఉద్యోగాలు పొందాలని కోరారు, రీఛా ప్రాజెక్ట్ అసిస్టెంట్ మేనేజర్ హేమంత్ మాట్లాడుతూ.. రీఛా చేస్తున్న కార్యక్రమాలు ప్రభుత్వ అధికారులు చక్కని సహకారం అందిస్తారని భవష్యత్తులో వారి సూచనలు మేరకు ఇంకా స్మార్ట్ పూర్ ద్వారా అందిస్తామని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఫిషరీస్ ఏడి ధనపాల్ నాబార్డ్ డీడీఎం బాబు, ఫుడ్ ప్రాసెసింగ్ భాను చందర్, రీఛా సిబ్బంది పీఆర్ఐ కమ్యూనిటీ మెంబెర్స్ పాల్గొన్నారు.

## కృష్ణపట్నం పోర్టులో అనుమానస్పదంగా వ్యక్తి మృతి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం పోర్ట్ పరిధిలో ఐదవ బెర్త్ సమీపాన సబ్ స్టేషన్ ప్రాంతంలో శుక్రవారం అనుమానస్పదంగా ఒక వ్యక్తి మృతి చెందిన విషయాన్ని కృష్ణపట్నం పోలీసులు గుర్తించారు. స్థానిక ఎస్ఐ జెపి శ్రీనివాస్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు రూరల్ మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన తాండ్ర వెంకట కృష్ణయ్య (55) అనే వ్యక్తి నాలుగు రోజుల క్రితం పోర్ట్‌లో ఉపాధి నిమిత్తం నౌకల వద్ద పనిచేసే సిబ్బందికి వంట చేసేందుకు పనిలోకి కుదుర్చుకున్నారు. మృతుడుతోపాటు మరో ఇద్దరు వంట పనికి వెళ్లారు. మృతుడు శరీరం పైన అక్కడక్కడ చిన్నపాటి గాయాలు ఉన్నాయి. మద్యం మత్తులో మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. తాండ్రకు వివాహమై భార్యకు దూరంగా ఉంటున్నారు. సుబ్బారెడ్డి పాలెం గ్రామంలోని తన సోదరి వద్ద ఉంటూ పోర్ట్ లో ఉపాధి కోసం వెళ్లారు. ప్రమాదపు స్థలాన్ని గ్రామీణ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ శివప్రియ, కృష్ణపట్నం, ముత్తుకూరు ఎస్ఐ జేపీ శ్రీనివాస్‌రెడ్డి, విశ్వనాథరెడ్డిలు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతానికి ప్రాథమిక విచారణ నేపథ్యంలో అనుమానస్పదంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# కేజీబీవీ స్కూలులో మౌలిక వసతులు కల్పించండి

## జడ్పీ సమావేశంలో పలు సమస్యలు లేవనేత్తిన కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి




**కావలి, మేజర్‌న్యూస్ :** 275 మంది విద్యార్థినులు ఉన్న కావలి కేజీబీవీ స్కూలులో మౌలిక వసతులు కల్పించాలని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి కోరారు. శుక్రవారం నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి హాజరు కాగా, ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీ, శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ ఆనంద్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీన హాజరయ్యారు. దివంగత మాజీ జెడ్పీ చైర్మన్ బాలచెన్నయ్యకు సంతాపంతో ప్రారంభమైన సభ రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టడమే కాకుండా, తల్లికి వందనం పథకాన్ని అద్భుతంగా అమలు చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తూ కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ప్రతిపాదించిన తీర్మానాన్ని ఏక గ్రీవంగా ఆమోదించడంతో సభ ముగిసింది. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకానికి సంబంధించిన మండల స్థాయి వివరాలను పొందుపరచకపోవడం భావ్యం కాదన్నారు. అదేవిధంగా కావలి జడ్పీ ఉన్నత పాఠశాలకి చెందిన 9 ఎకరాల భూమిలో 2 ఎకరాల్లో 174 పేద కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ వారికి ఇంటి పట్టాలు లేవని సభ దృష్టికి తేగా, భూబదలాయింపుకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కొత్త విద్యుత్ మీటర్లు బిగించినందువల్ల కరెంట్ బిల్లులు పెరిగాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. గ్రామాల్లో సైతం త్రీ ఫేజ్ విద్యుత్ ఇస్తున్న ప్రస్తుత తరుణంలో విద్యుత్ లైన్లను పెరుగుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో మోహన్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డీఎస్పీ శ్రీధర్ ను సత్కరించిన రెడ్‌క్రాస్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి సబ్ డివిజన్ పోలీసు అధికారి శ్రీధర్‌ను కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు శుక్రవారం కలిసి జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు కావలి సబ్ డివిజన్ పరిధిలో రక్తదాన శిబిరాలు నిర్వహించి, తమ రక్తకేంద్రంకు అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తలసేమియా డే కేర్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పామూరు శ్రీధర్, గత ఆరు నెలలుగా తలసేమియా బాధిత చిన్నారులకు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రతీ చిన్నారికి రెండు లేదా మూడు వారాలకు ఒక సారి ఉచితంగా రక్తం ఎక్కించడంతో పాటు, మందులు, పౌష్టిక ఆహారం దాతల సహకారంతో అందిస్తున్నామని వివరించారు. కావలి పట్టణంలోని వైద్యులు వారికి కావలిసిన స్కాన్, ఇతర పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. తాము నిర్వహిస్తున్న తలసేమియా సందర్శించి భాధిత చిన్నారులకు అండగా నిలవాలని కోరారు. డీఎస్పీ శ్రీధర్ స్పందిస్తూ, స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న రెడ్ క్రాస్‌కు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవి ప్రకాష్, వైస్ చైర్మన్ కె.హరినారప రెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, పాలక మండలి సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, జనిగర్ల మనోహర్, గొట్టిపాటి మనోరమ, తలసేమియా డే కేర్ సెంటర్ సబ్ కమిటీ సభ్యులు కల్లయ్య పాల్గొన్నారు.

## శ్రీ కోదండరామ స్వామి వారికి 40 రోజుల వేడుకలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పంచాయతీ పరిధిలోని జిబికేఆర్ ఎస్టీ కాలనీలో శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట జరిగి 40 రోజులు అయిన సందర్భంగా శుక్రవారం 40 రోజుల వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నవీన్ స్వామి ఆధ్వర్యంలో ఉదయాన్నే గణపతి పూజ పుణ్యాహవచనం కలశపూజ గణపతి పూజ హెూమం ఆదిత్యాది నవగ్రహ హెూమం జరిగింది. స్వామివారికి పంచామృతాభిషేకం పసుపు కుంకుమ గంధంతో అభిషేకం తులసి ఆకులు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు తదుపరి అష్టోత్తర కార్యక్రమం జరిపించారు. అనంతరం తీర్ధ ప్రసాదం వికరణ జరిగింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇచ్చిన హామీ మేరకు ఎన్నికలలో విజయం సాధించిన అనంతరం ఆలయాన్ని తమ సొంత నిధులతో నిర్మిస్తానని మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు కాలనీవాసులకు మాట ఇచ్చారు. ఆ మాట మేరకు ఆలయాన్ని తమ సొంత నిధులతో నిర్మించి ఆ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన జరిపించారు ప్రతిష్టాపన జరిగి 40 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఈ కార్యక్రమాలు జరిపించారు. దీంతో కాలనీవాసులు వారికి కృతజ్ఞతాంజలులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు జనార్ధన స్వామి ఆదిశేషయ్య స్వామి కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన ఆవాజ్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన ఆవాజ్ ఆత్మకూరు మండల కమిటీ శుక్రవారం సమ్మెలో కార్మికులతో కలిసి మద్దతుగా పాల్గొన్నారు. ఆవాజ్ మండల కార్యదర్శి, పి.యస్దాని, పి.సల్మాన్ ఖాన్, షేక్ ఆషికిన్, షేక్. ఖాజా రహమతుల్లా, పి.చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోరికలను వెంటనే అమలు చేయాలని, వారి నూతనవేతనాలను వెంటనే అమలు చేయాలని యస్దాని డిమాండ్ చేశారు.

## రెండవ రోజు కొనసాగిన కార్మికుల సమ్మె

▶ మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా నాయకులు




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తమ వేతనాల సవరణ చట్టం కోసం, మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా నిన్నటి నుండి సమ్మె చేపట్టిన ఆత్మకూరు సిఐటియు అనుబంధపు మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల సమ్మె శుక్రవారం రెండోవ రోజు కూడా కొనసాగింది. రెండవ రోజు సమ్మెకు సిఐటియు జిల్లా నాయకులు శివప్రసాద్ మద్దతు తెలుపుతూ సమ్మెలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికుల కనీస అవసరాలను గుర్తించి వేతన సవరణ చట్టాన్ని కొనసాగించాలని నినాదాలు చేస్తూ రెండవ రోజు సమ్మెను కొనసాగించారు. ప్రస్తుత ప్రభుత్వం గత ఎన్నికల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని సిఐటియు జిల్లా నాయకులు శివప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ, మున్సిపల్ కార్మిక సంఘ నాటకులు కొండమూరు హాజరత్తయ్య, నాగయ్య, డవుదరాజు, నాగేంద్ర, గురవయ్య, చిన్నబాబు, గురవయ్య, రిజ్వాన్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పంటల సాగులో రసాయనిక ఎరువులు, పురుగుమందుల విచ్చలవిడి వాడకాన్ని తగ్గించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజ్ కు మార్, స్టేట్ రిసోర్సు పర్సన్ మీరాబీలు పేర్కొన్నారు. రైతుసేవా కేంద్రాల పరిధిలోని విఏఏలు, వీహెచ్చీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణలో భాగంగా రెండోరోజైన శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని గండిపాళెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలు, భూ స్వభావాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు అధికంగా వాడినందున భూమి ఆరోగ్యం దెబ్బతిని సాగు చేసిన పంటలకు తెగుళ్ల విజృంభించడంతోపాటు దిగుబడులు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. భవిష్యత్తు ప్రకృతి వ్యవసాయానిదేనని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటలు సాగు చేయాలన్నారు. సిబ్బంది సైతం రైతులను ప్రోత్సహించి అధిక విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాస్టర్ ట్రైసర్ కె.రామ్మోహన్రావు, మండల వ్యవసాయాధికారులు రామ్మోహన్, మదన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌లో పలువురికి బదిలీలు

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న పలు ఉద్యోగులకు కమిషనర్ వైఓ నందన్ బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరపాలక సంస్థ పిఆర్‌ఓగా పనిచేస్తున్న కృష్ణ కిషోర్ ను టౌన్ ప్లానింగ్ విభాగానికి బదిలీ చేయగా అక్కడున్న కృష్ణారావును పిఆర్వోగా బదిలీ చేశారు. శానిటరీ ఇన్స్పెక్టర్‌గా ఉన్న చిన్న బాబును రెవెన్యూ విభాగం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ గా ఎ1 క్లర్కుగా బదిలీ చేయగా, శానిటరీ ఇన్స్పెక్టర్‌గా ఉన్న కృష్ణంరాజు ను ఇంజనీరింగ్ విభాగానికి, కృపాకర్ రావును పబ్లిక్ హెల్త్ విభాగానికి బదిలీ చేశారు. ఎస్టాబ్లిష్మెంట్‌లో ఉన్న మృదులను విఆర్ హై స్కూల్‌కు, సుహాసినికి మెప్మా విభాగానికి, మెప్మా విభాగం లో సీనియర్ అసిస్టెంట్ ఉన్న బాలసుబ్రమణ్యం వార్డు సచివాలయం విభాగానికి బదిలీ చేశారు.

# వర్షపు నీరు నిల్వ లేకుండా చూడండి : కమిషనర్

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నగర వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కమిషనర్ వై.ఓ నందన్ తెలిపారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక కె.వి.ఆర్ పెట్రోల్ స్టేషన్ కూడలి సమీపంలోని వీధుల్లో కమిషనర్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రధాన రోడ్లను క్రమంతప్పకుండా శుభ్రం చేయాలని, అన్ని డివిజనుల్లో ఇండ్ల చుట్టూ, ప్రాంగణాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకునే విధంగా గృహాల యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా హెచ్చరిక బోర్డులతో సూచనలు ఇవ్వాలని వెల్లడించారు. వర్షపు నీరు ప్రవహించేందుకు వీలుగా అన్ని డ్రైను కాలువల్లో పూడికతీత, మురుగు తొలగింపు పనులను ప్రతిరోజూ చేపట్టాలని ఆదేశించారు. దోమల ఎదుగుదలకు దోహదపడే మంచినీటి సరఫరాలో లీకేజీ ప్రాంతాలు, వాడి పడేసిన టైర్లలో నిల్వ ఉండే నీరు, బహిరంగ ప్రదేశాల్లో డంప్ చేసిన ఖాళీ కొబ్బరి బోండాలలో నిల్వ ఉండే వర్షపు నీరు, పూల కుండీలు, వాడకంలో లేని నీటి తొట్లు, బావులపై ప్రజలందరికీ చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగం సూపర్ వైజర్లు, ఇన్స్పెక్టర్‌లు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



# దాడికి నిరసనగా నల్ల దుస్తులు ధరించి సంఘీభావం





## ప్రసన్నను రాజకీయంగా ఎదుర్కోలేకే ఈ దాడి

**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గం, ఇందుకూరుపేట మండలం జగదేవీపేట గ్రామానికి చెందిన వైసీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ఇంటిపై జరిగిన దాడికి నిరసన తెలుపుతూ దాదాపు 100 మంది నల్ల దుస్తులు ధరించి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కి సంఘీభావం తెలిపారు. అనంతరం వారు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి రాష్ట్రంలో ఎక్కడా.. ఎన్నడూ.. లేని విధంగా నల్లపరెడ్డి పై దాడి చేసి వారి తల్లిని భయభ్రాంతులకు గురి చేశారు. నెల్లూరు జిల్లాలో వేమిరెడ్డి దంపతులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక పిరికిపంద చర్యకు పాల్పడ్డారు. నల్లపరెడ్డి ఇంట్లో దేవుడు పటాలని విగ్రహాలని ధ్వంసం చేశారు ఆ పాపం ఊరికి పోదు త్వరలో ఆ దేవుడే మీకు తగిన గుణపాఠం చెప్తాడు. ఈ దాడితో వేమిరెడ్డి దంపతులు రాజకీయంగా పతనం అయిపోయారు పార్టీలకతీతంగా దేశవ్యాప్తంగా నల్లపరెడ్డి కి సంఘీభావం తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలోజొన్నవాడ దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బట్టేపాటి విజయమ్మ, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఎల్‌డిఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, కోవూరు జడ్పీటీసీ కవరగిరి శ్రీలత, ఎస్ పేట ఎంపీపీ పద్మజా రెడ్డి, వైసిపి కోవూరు నియోజకవర్గ ఇంటిలెక్చ్వల్ అధ్యక్షులు కొండలపూడి శ్రీనివాసులు రెడ్డి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీలో చేరిన 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్





**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి సమక్షంలో చింతరెడ్డిపాళెంలోని ఆనం విజయకుమార్ రెడ్డి కార్యాలయం నందు అధికాం టీడీపీ పార్టీ వీడి వైసీపీలో చేరిన 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్, 17వ డివిజన్ నుంచి 200 కుటుంబాలు చేరడం జరిగింది. ఈ సందర్భంగా 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్ మాట్లాడుతూ.. నాకు కార్పొరేటర్ పదవి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి వల్ల రావడం జరిగిందని తెలియజేశారు. అలాగే టీడీపీ నాయకుల, ఇబ్బందులకు గురై విధిలేని పరిస్థితులలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీకి రావడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి నాయకత్వం మీద నమ్మకంతో పార్టీలోకి రావడం జరిగిందని తెలిపారు. అలాగే పార్టీ బలోపేతానికి నేను సాయి శక్తుల కృషిచేసి జగన్ మోహన్‌రెడ్డితో కలిసి నడుస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ వైసీపీ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి నేను అందుబాటులో ఉంటూ మీకు అండగా ఉంటానని తెలియజేశారు. అలాగే ప్రతి ఒక్క నాయకుడు, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అలాగే గతంలో పార్టీని వీడిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరల తిరిగి పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర అధ్యక్షుడు, 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, 17వ డివిజన్ ముఖ్య నాయకులు సి.హెచ్ ప్రభాకర్ రెడ్డి, హరిబాబు, గోపి, భాస్కర్, ఓబుల్ రెడ్డి, రూపేష్, చిన్న, ఉదయ్ భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్య

విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం

మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9000483583

# శాకాంబరి అలంకరణలో సంతానలక్ష్మి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక బీసీ కాలనీ సమీపంలో వెలసి ఉన్న శ్రీసంతానలక్ష్మి అమ్మవారు ఆషాడమాస చివరి శుక్రవారం సందర్భంగా భక్తులకు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సం దర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# మతసామరస్యానికి ప్రతీకగా మొహరం

- వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని స్థానిక 4వ డివిజన్ జాకీర్ హుస్సేన్ నగర్, న్యూ కాలనీ నందు గురువారం రాత్రి మొహరం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత లెక్కల వెంకారెడ్డి, మిద్దె రవి, జనసేన నాయకులు శ్రీకాంత్ తదితరులు విబిఆర్ కు ఘన స్వాగతం పలికారు. ముస్లిం మత పెద్దలు, కమిటీ సభ్యులు షేక్ రఫీ పిరానే పీర్ అల్లా ప్రత్యేక దువ నిర్వహించి విజయభాస్కర్ రెడ్డికి ఆశీర్వచనాలు చేశారు. అనంతరం విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మొహరం వేడుకలకు హాజరు కావడం ఎంతో సంతోషంగా ఉందని, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరం వేడుకలను అందరూ కలిసికట్టుగా నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మూడో డివిజన్ జనసేన పార్టీ ఇంచార్జ్ బత్తల శ్రీకాంత్ తెలుగుదేశం పార్టీ నాయకులు మిద్దె రవి, సుమన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.